## క్లుప్తంగా

### ప్రజలను మభ్యపెడుతున్న మంత్రి

**మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

**కల్హేర్(నారాయణఖేడ్):** ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పేరిట మంత్రి దామోదర రాజనర్సింహ నారాయణఖేడ్ ప్రాంత ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సిర్గాపూర్ మండలం వాసర్‌లో విలేకరులతో మాట్లాడారు. వాసర్ శివారులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కోసం గిరిజన రైతులకు ఇచ్చిన భూమిని లాక్కున్నారని మండిపడ్డారు. సర్వే నంబర్ 12లో మిగతా 98 ఎకరాల భూమిని కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు కేటాయించిన బడ్జెట్‌పై మంత్రి దామోదర చెప్పిన మాటల్లో స్పష్టత లేదని తెలిపారు. ప్రతిపక్షలపై బురద జల్లేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### సెంట్రల్ టెలికాం బోర్డు మెంబర్‌గా కుమార్



ఎంపీ రఘునందన్‌రావు నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న కుమార్

**పటాన్‌చెరు టౌన్:** పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్‌ను కేంద్ర ప్రభుత్వం టెలికాం బోర్డు మెంబర్‌గా నియమించింది. ఆ మేరకు శుక్రవారం నియామక పత్రాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీజేపీని నమ్ముకుని, సిద్ధాంతం కోసం నిరంతరం పని చేస్తున్న కార్యకర్తలను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తూనే ఉందన్నారు. అనంతరం నూతన టెలికాం బోర్డు మెంబర్ కుమార్ మాట్లాడుతూ తనను ఈ పోస్టులో నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### రేషన్ బియ్యం స్వాధీనం

**వ్యక్తి అరెస్టు**

**సంగారెడ్డి క్రైమ్:** పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. సంగారెడ్డి టౌన్ సీఐ భాస్కర్ కథనం ప్రకారం.. పట్టణంలోని బసవేశ్వర్‌నగర్‌లో స్థానికంగా నివాసం ఉండే మహమ్మద్ షేక్ బియ్యాన్ని అమ్మడం కొనడం చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీస్‌లు అతని గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 70 బ్యాగులు, 25 క్వింటాల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### మందుబాబులకు జరిమానా

**సంగారెడ్డి క్రైమ్:** పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. గురువారం అర్ధరాత్రి టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా ముగ్గురు వాహనదారులు తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డారు. వారిని సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పన ముగ్గురికి జరిమానాను జడ్జి విధించినట్లు పేర్కొన్నారు.

**ఆరుగురికి సైతం..**

**పటాన్‌చెరు టౌన్:** డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురు పట్టుబడ్డారు. వారు తాగి వాహనాలు నడుపుతున్నారు. ఆ మేరకు శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### మహాసభలకు తరలిరండి

**జహీరాబాద్ టౌన్:** పట్టణంలో శనివారం నుంచి ప్రారంభంకానున్న సీపీఎం జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి జయరాజ్ కోరారు. పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సభల ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల పాటు సభలు కొనసాగుతాయన్నారు. ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. ఈ సభను జయప్రదం చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. జహీరాబాద్ కార్యదర్శి బి.రాంచందర్, నాయకులు మాణిక్యం. రాజిరెడ్డి, మహిపాల్, నరేశ్ పాల్గొన్నారు.

# పెద్దచెరువుకట్టకు ముప్పు!

- ఇటీవల వింగ్‌వాల్‌కు ఏర్పడిన భారీ రంధ్రం
- 180 ఇసుక బస్తాలతో తాత్కాలిక పూడ్చివేత
- భవిష్యత్‌లో పునరావృతం కావొద్దంటూ రైతుల వినతి



పెద్ద చెరువుకట్ట



ఇసుక బస్తాలతో పూడ్చిన గండ

**జోగిపేట(అందోల్):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అందోల్ పెద్ద చెరువు 'వింగ్ వాల్'కు రంధ్రం ఏర్పడింది. అప్పటికప్పుడు సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తమై 180 ఇసుక బస్తాలతో పూడ్చారు. దీంతో ముప్పు తప్పింది. వందల ఏళ్ల చరిత్ర ఉన్న పెద్ద చెరువు కట్టకు గండి పడటం ఇదే మొదటిసారి. దీని వల్ల రాబోయే రోజుల్లో ముప్పు పొంచి ఉంది. దీని కింద 1,165 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులోకి సింగూరు ప్రాజెక్టు కాలువల ద్వారా నీరు వచ్చి చేరుతుండడంతో 12 నెలలుపాటు నిండు కుండలా ఉంటుంది. ప్రతీ వ్యవసాయ సీజన్‌లో నీటిని వదులుతుంటారు. నీరు నిల్వ ఉన్న కట్ట వద్దే పెద్ద గండి పడడంతో రైతులు ఆందోళన చెందారు. మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

**అప్పుడు స్పందించకుంటే!**

ఒక వేళ వింగ్ వాల్‌కు ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చనట్లయితే అందోల్ గ్రామం పరిధిలోని కొటాల ప్రాంతం వైపు నీరు పారే ప్రమాదం ఉండేది. 180 వరకు ఇసుక బస్తాలతో గండి పూడ్చేందుకు వినియోగించారంటే భారీ గండి పడింది అని చెప్పొచ్చు. చెరువుకు పండిన గండి ఎప్పటికైనా ప్రమాదమేనని అధికారులు అంటున్నారు. పూర్తి స్థాయిలో అవతలి వైపు వరకు కూడా గండిపడితే పరిస్థితులు దారుణంగా ఉంటాయని తెలుస్తోంది.

**రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు**

అందోల్ వింగ్ వాల్‌కు రంధ్రం పడింది. మరమ్మతు చేపట్టేందుకు ప్రభుత్వానికి రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. రంధ్రం వద్ద కాంక్రీట్, స్టీల్ రాడ్‌లతో ఫౌండేషన్ పనులు చేపడుతాం. అత్యవసరమని భావిస్తే వెంటనే రూ.10 లక్షలతో పనులు చేపడతాం. లేకుంటే నీటి పరిమాణం తగ్గిన తర్వాత పనులు చేపడతాం. ఒకవేళ ఆ అవకాశం కూడా లేకుంటే నీటిని తరలించిన తర్వాత పనులు చేపడతాం.

– విక్రమ్, డిప్యూటీ ఈఈ, ఇరిగేషన్ శాఖ, అందోల్

## ప్యారవరంలో.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



ప్యారవరంలో వాగులో వేసిన చెత్తాచెదారం

**ఝరాసంగం(జహీరాబాద్):** అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించి, తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశాలున్నాయి. అయినా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు పరచడం లేదని అధికారులపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ప్యారవరంలో కొన్ని రోజులుగా చెత్త సేకరణ జరగటం లేదు. ట్రాక్టర్ ఉన్న సాంకేతిక కారణంతో పనులు చేపట్టడం లేదని తెలుస్తోంది. చెత్త సేకరణ చేపట్టకపోవడంతో గ్రామంలో ఉన్న చిన్న వాగు వద్ద చెత్తను పారబోస్తున్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ప్రాంతంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది. అధికారులు పర్యటన చేస్తున్నా ఇవేవీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా చెత్తసేకరణ జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 'చెత్త' పని.. చింతించేలా చేసి..



నారాయణఖేడ్: చెత్త ఎత్తి వేస్తున్న దుకాణం యజమాని

పట్టణంలోని సువర్ణ షెట్కార్ టాకీస్ పక్కనుంటున్న ఓ యజమాని తన దుకాణంలోని చెత్తను శుక్రవారం సాయంత్రం రోడ్డుపై పడేశాడు. ఈ సమయంలో తనిఖీలకు వచ్చిన మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ గమనించి యజమానితోనే ఎత్తివేయించారు. మరోసారి ఇలా చేస్తే జరిమానాతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– నారాయణఖేడ్

# బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

- జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి



అవగాహన కల్పిస్తున్న జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి

**పటాన్‌చెరు టౌన్:** బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని, అతిక్రమిస్తే రెండేళ్ల జైలు తప్పదని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పటాన్‌చెరు బస్టాండ్, పటాన్‌చెరు మండలం గీతం కళాశాల పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు, ప్రచారంపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. 18 ఏళ్ల లోపు వారికి పొగాకు వస్తువులను అమ్మరాదని సూచించారు. విద్యాసంస్థల వద్ద 100 మీటర్ల వరకు ధూమపానం చేయడం, ఉత్పత్తుల అమ్మకం నిషేధమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, కార్మికులు, పాల్గొన్నారు.

# నకిలీలను అరికట్టేందుకే శ్యాంపిల్స్



జహీరాబాద్ టౌన్: రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ లావణ్య

**జహీరాబాద్ టౌన్:** నకిలీ విత్తనాలను అరికట్టడానికే శ్యాంపిల్స్‌ను సేకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లోని మక్క, శనగ, మినుము విత్తనాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు మేలు జరగడానికి, నకిలీలను అరిట్టడానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. రబీ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విత్తన నాణ్యతను పరిశీలిస్తున్నామన్నారు.

**భూసార పరీక్షలు తప్పనిసరి**

**సంగారెడ్డి టౌన్:** రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల అధికారులు అన్నారు. సంగారెడ్డి మండలంలోని పసల్వాదిలో మూడో రోజైన శుక్రవారం కూడా జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పొలాల్లో రైతులు భూసార పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని అన్నారు. అనంతరం గణపతి షుగర్ ఫ్యాక్టరీని సందర్శించి విద్యార్థులకు పరిశ్రమలలో చెరకు చక్కెరగా ఎలా ఉత్పత్తి చేస్తారనే విషయాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



జహీరాబాద్ టౌన్: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న భిక్షపతి

**జహీరాబాద్ టౌన్:** ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి భిక్షపతి ప్రజలకు సూచించారు. ఫ్రైడే డ్రై డే పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని సత్వార్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. పారిశుద్ధ్య పనులు సవ్యంగా చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామస్తులతో మాట్లాడారు. పారిశుద్ధ్య లోపం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఇంటి పరిసరాలను శుభ్రం ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లోని కుండీల్లో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. తరుచూ నీటిని మార్చాలన్నారు. కొబ్బరి బోండాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు తదితర వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉండొద్దన్నారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించండి**

**రాయికోడ్(అందోల్):** గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా తగిన విధంగా గ్రామ పంచాయతీ సిబ్బందితో ఎప్పటికప్పుడు పనులు చేయించాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ సూచించారు. మండలంలోని మహబత్‌పూర్, సిరూర్, దౌల్తాబాద్ గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే లో భాగంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా, పరిశుభ్రతపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు అందకముందే సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రాయికోడ్‌లోని ఐకేపీ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ, ఈజీఎస్ సిబ్బందితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, ఏపీఓ రమేశ్, ఏఈ దేవయ్య, సిబ్బంది ఉన్నారు.

**ఇంటి పరిసరాలు..**

**ఝరాసంగం(జహీరాబాద్):** ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఐనిష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రజలకు చెత్త సేకరణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం తమ ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి తిరిగి నింపుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యం



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న మండల నోడల్ అధికారి మన్మథకిషోర్

**నారాయణఖేడ్:** పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నందున వారి విద్యాభివృద్ధికి దాతలు సహకారం అందించాలని మండల నోడల్ అధికారి మన్మథకిశోర్ విజ్ఞప్తి చేశారు. ఖేడ్ మండలం ర్యాలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ సహకారంతో శ్రీకర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వినూష రూ.30 వేలతో సమకూర్చిన బ్యాగులను శుక్రవారం పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివుతుంది పేదవిద్యార్థులు అని వారికి దాతల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగసుజాతారాణి, నిజంపేట మండల విద్యాధికారి రాములు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్రావు, ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, విజయ్‌కుమార్, పర్లాల్, సంతోషమ్మ, సక్రు, సరిత పాల్గొన్నారు.

# వేతన బకాయిలు వెంటనే చెల్లించండి



ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వాతికు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** పట్టణంలోని ఈఎస్ఐలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతన బకాయిలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వారి సమస్యలను పరిష్కరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వాతికు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 3, 4 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఈ విషయాన్ని డిప్యూటీ లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకుపోయామన్నారు. అప్పుడు ఆయన.. కాంట్రాక్టర్లకు దసరా పండుగకు ముందే జీతాలివ్వాలని ఆదేశాలిచ్చినా నేటికీ కూడా వారు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పుడైనా దీపావళి పండుగకు ముందే వేతనాలు ఒకేసారి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, సురేశ్, సంతోష, ఉమేరాబేగం, పోచమ్మలు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ అక్రమ నిర్మాణం చేపడితే చర్యలు**

**పటాన్‌చెరు టౌన్:** అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని పటాన్‌చెరు మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులు మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులకు మించి భవనాలు నిర్మిస్తే నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే ఇంద్రేశం గ్రామ పరిధిలో 8 భవనాలకు నోటీసులు జారీ చేసి అందులో నాలుగు అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్లు తెలిపారు.

**◆ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి**

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆత్మకూర్ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు తమ్మలి రవి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ గ్రామానికి చెందిన డాకూర్ తుల్జమ్మకు రక్తం అవసరమైతే కుటుంబ సభ్యులు తమ్మలి రవిని సంప్రదించగా గ్రామానికి చెందిన శ్రీకాంత్, సాయి వంశీలతో రక్తదానం చేయించి మానవత్వం చాటారు. తలసేమియా, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం పాట్లు పడుతున్నారని రవి అన్నారు. రక్తదానం చేస్తే ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

**◆ వ్యర్థాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు**

**పటాన్‌చెరు:** 'వ్యర్థాల నిర్వహణ -వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, ఐపీఎల్ఏ అంతర్జాతీయ ఫోరం 2024' పై 14వ అంతర్జాతీయ సదస్సును గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహించనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిపుణులతో చర్చలు, విజ్ఞాన భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1 వరకు ఈ సదస్సును హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం వెల్లడించారు. వివరాల కోసం సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్ నంబర్ 98300 44464, నిర్వాహకుడు డాక్టర్ వై.ఎల్.పీ. థోరల నంబర్ 888 678 5076లలో సంప్రదించాలని సూచించారు.

**◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు**

**వట్‌పల్లి(అందోల్):** మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో మహా పంచలింగేశ్వర ఆలయ ఐదవ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, గణపతిపూజ, అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలు మాజీ సర్పంచ్ శివచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించగా నాయకులు సంగమేశ్వర్, మాజీ ఉప సర్పంచ్ బస్వరాజ్ , తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శంభిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**◆ పనుల్లో నాణ్యత పాటించాలి**

**పటాన్‌చెరు టౌన్:** సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కాంట్రాక్టర్ కు సూచించారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. సాయిరాం నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ నిధులతో ఒక కోటి 13 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

# పాదయాత్ర విజయవంతం కావాలి



మాలధారులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** శబరిమల పాదయాత్ర విజయవంతం కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరుకున్నారు. శుక్రవారం బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి శబరిమల వరకు మాలధారులు చేపట్టిన యాత్రను ప్రారంభించారు. గురుస్వాములు నాగరాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ప్రసాద్, దేవేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో మహాపాదయాత్ర చేపట్టడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ నాయకులు రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్వాములకు రూ.లక్ష అందజేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

# ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి

- బురదలో దిగబడిన లారీ
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- జేసీబీ సాయంతో తొలగించిన పోలీసులు



బురదలో ఇరుక్కున్న లారీ

**జహీరాబాద్ టౌన్:** లోడుతో వెళ్తున్న లారీ అల్లనా బైపాస్ రోడ్డులో ఉన్న శుక్రవారం బురదలో ఇరుక్కుపోయింది. దీంతో దారిలో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. క్రేన్ సాయంతో వాహనం బయటకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. విషయానికి వస్తే.. అల్లనా బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో జాప్యం కారణంగా వర్షాలకు దారి బురదమయంగా తయారవుతోంది. ఈ దారి గుండా బీదర్ అల్గోల్ తదితర గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగుస్తుంటారు. నిత్య రద్దీగా ఉంటుంది. మరొక విషయం ఏమిటంటే రోడ్డు మధ్య నుంచి పెద్ద వాగు ప్రవహిస్తుండటం వల్ల వర్షాకాలంలో ప్రయాణాలు చేయడం కష్ట సాధ్యం. కొద్దిపాటి చినుకులకే చిత్తడి చిత్తడిగా మారుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం పెద్ద వాగుపై రూ. 33 లక్షలతో ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. ఇవి దాదాపు పూర్తయ్యాయి కానీ రోడ్డు పనులు మిగలాయి. ఇటీవల ఈ రోడ్డుపై మొరం పోయడంతో వర్షానికి బురదగా తయారైంది. దీంతో తరుచూ వాహనాలు అందులో కూరుకుపోతున్నాయి. అందుకు నిదర్శమే లారీ ఇరుక్కపోవడమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400